# కదలిపోయిన రైలుబండి

"ఎల్లోరా"

ఎదురుకుండా బల్లమీద చాలా మంది కూర్చున్నారు! ఒక్కరూ నాకు తెలిసినవారు లేరు—అందులోనూ అటువంటి దూరప్రయాణాలంటే ఏమిటో ప్రాణం బిక్కుబిక్కు మంటూ వుంటుంది. ఆ సమయంలో మనవంక చూసినవాడు బంధువు! పలకరించినవాడు పరమాత్ముడు!

బండి స్టేషన్ వదిలిపెట్టి రెండు మూడు స్టేషన్లుకూడా వెనుకకు నెట్టుకుపోయింది. అసలు ఈ యినపమేక ధూమ శకటానికి మానవులంటే అసలు గౌరవభావం వున్నట్లు కనుపించదు. ఆ మాత్రం గౌరవభావం అనేది ఏకోశాన వున్నా నన్ను ఒంటరిగా బలవంతంగా అంతవేగంగా తీసుకుపోయేదేనా?

ప్యాసింజరుకు బీదవారంటే కొంచెం అభిమానం! ఇక మెయిలు బడీవుంది. చిన్న స్టేషన్లో ఆగదు సరికదా నెమ్మదిగా నైనా పోదు. తనకేం చిన్నవారంటే లెక్కలేనట్లు!

ఇంతకీ ఆ ట్రైన్ అటువంటిది! ఆ పొగరుబోతు దురుసు బండి మెయిల్ లోనే ఎక్కి ప్రయాణించవలసిన అభాగ్యులలో నిర్భాగ్యుణ్ణి నేనొకడిని. ఎక్కడం ఎంత కష్టంమీద జరిగిందో కూర్చోవడం అంతకు రెండింతలు కష్టంమీద జరిగింది.

ఎక్కీ ఎక్కేటప్పటికే ఓ ఆయన వచ్చి సారీ బ్రదర్! ఇది 'రిజర్వేషన్' కంపార్టుమెంటు అన్నాడు!

సరే! ఆమాట నమ్ముదామన్నా 20వ శతాబ్దపు సూటు నాగరికత ఫేషన్లో దిగుదామన్నా కంపార్టుమెంటు ముందరే సుద్దముక్కతో "ఓన్లీ ఫర్ ఎయిర్ ఫోర్స్ మెన్" అని తాటికాయలంత అక్షరాలతో రాసివుంది!

అటు ఆయన మాట నమ్మడమా? ఇటు ఈ సుద్ద అక్షరాలను నమ్మడమా? ఏం తోచక కొంచెం సేపు తికమక పడ్డాను. అయినా ఒక విషయం అబద్ధం ఆడినా అతికినట్టుగా వుండాలి! అందులోనూ ప్రతివారికి ఇదో అలవాటు అయిపోయింది. "రిజర్వేషన్" అనడం, సుద్దతో ఏదో ఒక స్పెషల్ కంపార్టుమెంటుని ముందే రాసిపెట్టుకుని, అమాయకంగా కనుపిస్తే, మరీ దబాయించడానికి! ఇది నాకు చాలా బాధకలిగింది.

"బండి బయలుదేరింది మద్రాసునుంచి—తమిళదేశం నుంచైనా ప్రయాణం చెయ్యవలసింది. యిక ముందు ఆంధ్ర గ్రామసీమల మధ్యనుంచే! అటువంటిది ఆంధ్రుడనయిన నేను ఎందుకు వెనక తియ్యాలి" అనుకొని.

"లోనికి బెడ్ పెట్టి జరుగు బ్రదర్" అన్నాను! ఏమనుకున్నాడో ఏమో గట్టిగా "హ్వాట్" అన్నాడు.

"హ్వాటు లేదు గ్యేటూలేదు! జరుగు"అన్నాను. ఇంకా పట్టుదలగా వెనుదిరుగని వీరుని లాగ!

అదృష్టం అనేది అందరికీ అస్తమానం చెప్పిరాదుకొంతమందికి కొన్నిసమయాలలోనే!

అటువంటి అదృష్టం ఇంతలో రైల్వే చెకింగ్ ఇన్స్పెక్టర్ వచ్చి "ఎవరు ఈరాత రాసింది? నాన్సెన్స్" అంటూ చెరిపి లోనికివచ్చి "ఎక్కడికి మీరంతా అన్నాడు?"

నన్ను కానట్లుగానే నేను ఊరుకున్నాను. ఇంకో ఆయన పెద్ద వీరుడిలా "బెజవాడ అన్నాడు!"

"ఓన్లీ ఫర్ 3 హన్‌డ్రెడ్ మైల్సు ప్యాసింజర్స్" అన్నాడు కంచు మోగినట్లు చెకింగు యిన్స్పెక్టరు!

చెబితే నమ్మండి! నమ్మకపోండి!! వెంటనే నా రాజమండ్రి టికెట్ ని అదే పనిగా చేతిలోతీసుకుని 360 మైళ్ళు అన్న అంకెను వందసార్లు చూచుకున్నాను.

ఆవెనుక ఆముదం తాగినవాడిలా ముఖంపెట్టి నన్ను దబాయించిన సూటు నాగరికుడు హాల్లో బ్రదర్ అంటూ మాటను మింగేశాడు!

ఆ అవస్థ నేను ముందే గ్రహించి "ఫర్వాలేదు సర్దుకు కూర్చుందాం! అందరం అడంగు చేరుకోవలసిన వాళ్ళమే" అన్నా!

జీడిపాకం ముక్కయిస్తే సంతోషపడే బాలుడి లాగ ముఖం ఇంతచేసుకుని పరచిన బెడ్‌నిచుట్టి నన్ను పక్కనే కూర్చోబెట్టుకున్నాడు రైలు మిత్రుడు!

విచిత్రం ఏమిటంటే అంతదాకా సీరియస్‌గా దెబ్బలాడిన మే మిద్దరం బండి సగం దూరం వెళ్ళేటప్పటికి ప్రాణస్నేహితుల మయిపోయాం! ఆ మహిమ రైలు పొగలోవుందో ధ్వనిలోవుందో కాని! అందుకే మనవాళ్లు అంటూంటారు. దెబ్బలాటతో ప్రారంభమైన స్నేహం దృఢంగా కలకాలం నిలుస్తుందని ఇందుకే కాబోలు!

రైలు మిత్రులం కిచకిచలతోటీ పకపకలతోటీ, ఒకరు కాఫీకి బిల్లుఇస్తే ఒకరం పేపరుకు సొమ్ము చెల్లిస్తూ కులాసాగానే ప్రయాణం సాగించడం సాగించాం.

ఈ జరిగిన ప్రయాణంలో మాకు ఎదురుకుండా ఒంటరిగానే అనుకుంటాను. ప్రయాణం చేస్తూన్న ఒక పదహారేళ్ళ అమ్మాయి కూర్చునివుంది. చేతిలో ఒక తెలుగు వారపత్రిక పెట్టుకుని చదువుకుంటోంది. అప్పుడప్పుడు ఆ పేపరు సహాయంతోనే అడ్డుగానే మమ్మల్ని మా సంభాషణల్ని పరికిస్తూ వింటూ తన వ్యావృత్తిలో తనువుంది.

ఆ అమ్మాయి ముఖములోనూ దుస్తులధారణలోను చూపులోను కొంచెంచదువుకున్న నాగరికత కనుపిస్తూంది.

చాలా బొమ్మలు చూస్తూంటాము! చాలా కళ్లు పరికిస్తూనే వుంటాము.

కాని ఆ అమ్మాయి కళ్లు నడుం ముక్కు, వేళ్ళ సొగసు చూస్తూంటే అజంతా సుందరి కుడ్య శిల్పచాతురి 'ఓ'యని పలుకుతూ ఏమిటో తెలియని తన్మయత్వంలో ముంచెత్తుతూంది.

ఆ ప్రయాణంలో ఆకలికి తట్టుకున్నా నిద్రా భంగానికి తట్టుకున్నా కాని, ఈ అమ్మాయి చూపులబాణ సంధానానికి మాత్రం నేను తట్టుకోలేక ఆనందాన్ని అహ్లాదంతో నీ రాజనం నా హృదయంలోపలనే అర్పిస్తూ మొగలి రేకుల ఉయ్యాలలో వూగిసలాడసాగాను.

ప్రకృతి వింత భావంకలది! దీనిని చూస్తూంటే అంత అసూయ ఎందుకో అనిపిస్తూంది! మానవుణి ఆడించగలదు! నవ్వించగలదు ఏడుస్తూంటే పళ్ళికిలించి తనూ నవ్వకలదు! అందుకే ప్రకృతి చిలిపిది అంటారు! ఉన్నట్లేవుండి మా ఆనందపు కళ్ళజంటల సంభాషణలకు ఒకసారిగా బ్రేకువేసింది!

గుప్-గుప్ అంటూ రైలుబండివచ్చి పెద్దశ్వాసను వదిలి బెజవాడ ప్లాట్‌ఫారంమీద నిలబడింది! ఒక్కసారిగా ఆ అమ్మాయి అదిరిపడి ఏమిటో బిత్తరపోయినట్లు కిటికీలోనుంచి పరికించసాగింది.

నేను అంతదాకా చూపులసందిస్తూ ఆ సమయానికి అనుకోకుండా అప్రయత్నంగా ఒక్కసారి లేచి నుంచున్నాను ఇంతలో "గుడ్‌బైబ్రదర్ అన్నాడు రైలు మిత్రుడు.

బిత్తరపడి ఒకే బైబై అన్నాను!

ఇంతలోనే గార్డ్ జెండా వేయడం ఈల వినపడడం జరిగింది తిరిగి రైలు తన నడక సాగించడం మొదలు పెట్టింది.

ఆ అమ్మాయివుందాలేదా ఆని నేను; ఆత్రుతతో నాకేసి ఆ అమ్మాయి చూడసాగింది! నన్నుచూసే చూడడంతోనే వారపత్రిక అడ్డుగా పెట్టుకుని చదువులో మునిగిపోయింది.

ఈ విధమైన ప్రవృత్తిని ఏమనాలో నాకు తెలియదు. సిగ్గుఅన్నా చిలిపితనం అన్నా సరిపోతుందేమో!

యుద్ధం ప్రకటించి మిత్రత్వసంధి చేసుకున్న రైలు మిత్రుడు బెజవాడలో దిగిపోతాడు! ఇతరత్రా రైలుసంభాషణలు ఏం సాగలేదు. ముఖాలు మాత్రం చూసినవి కొన్ని, కొత్తవి కొన్ని వున్నాయి! బాగా తెలుసును-అని అనుకోవలసిన అర్హత ఏదైనావుంటే ఆ చిలిపిచూపుల ఎదుటి అమ్మాయి మాత్రమే అని అనుకోవలసి వుంటుంది. అందుకు నేనూ అటే ఊసుపోక చూస్తూ ప్రయాణాన్ని కులాసాగా జరుపుకుంటున్నాను!

ఇందుకూ ఒక తెలివివుండాలి! రైలుప్రయాణంలో అదేస్వర్గంలాగ కిచకిచలతో పకపకలతో అడుగుకు కొంతమంది చేరుతే కొంతమంది ఒంటెత్తుగా అటు యింటిలోని వారిని, ఇంటినీ తలుచుకొని కాఫీ అయినా త్రాగకుండా బిక్కుబిక్కు

మంటూ కూర్చుంటారు. అందుకే రైలు ప్రయాణాలలోకూడా కొంత అనుభవం అవసరం.

"ఈ అమ్మాయికి పెళ్ళి అయిందా? అయితే భర్త ప్రక్కన కనుపించడేమిటి? మెడలో పుస్తె కనుపించదే? పుస్తె అవసరంలేని వివాహం జరుపుకుని వుండలేదుగదా.

అలా తొంగిచూడకపోతే "ఏమండి కొంచెం కాఫీకి లేద్దురూ" అనో కొంచెం ఈ సామాను చూస్తూంటారా...గదిలోకి వెళ్ళివస్తాను" అనో పలకరించి స్నేహంచేసుకోక అలా పత్రికలో ముఖందాచుకుని కంటిని మెలికలు తిప్పుతూ శ్రమ పడకపోతే ధైర్యంగా చూడకూడదూ?

అసలు ఈ స్త్రీ బుద్ధే ఇంతేమో! అదేపనిగా మొగవాడిని పరికించి చూడడం - తిరిగి ఆ మొగవాడు తనకేసి చూశాడా, ముఖం ముడుచుకుని ఏమీ ఎరగనట్లుగా మూగనోము పట్టడం. ఎవరిలో చూచినా ఇంతే!

హంసనడకలు నడిచేది ఒకత్తైతే నెమలి తిప్పులు తిప్పేది ఒకతె! వీరినని ఏంలాభం—ఆ కుమ్మరి బ్రహ్మయ్యనే అనాలికాని!

ఇలాగ ఏమిటేమిటో నాలో నేను తర్కించుకుంటూ—ఊహించుకొంటూ—అప్పుడప్పుడు ఎదుటి అమ్మాయి చూపులకు చూపులు అందిస్తూ కూర్చున్నాను. అబ్బ! నా శ్రమ ఎంత అని చెప్పడం.

"ఎవరు యీతను? ఎవరితోనూ మాట్లాడకుండా మొద్దులా కూర్చున్నాడు! అసలు ఇతను పురుషుడేనా! ఇంతసేపటినుంచి నేనుచూస్తున్నాను. చూసిచూసి నా కళ్ళు మూతలుకూడా పడుతున్నాయి!

నిజమైన మొగాడు పనున్నా | లేకపోయినా ఏమమ్మాయి నువ్వుపడుకో...నీ సామాను నేను చూస్తాను అనో, కాఫీ పిలవమంటారా! అనో పలకరించి ఎంతచనువుగా వుండేవాడే!

కాని ముఖం ఎంత అందమయింది? ఆ క్రాపు ఎంత అందంగా గూడుకట్టుకుని వుంది? మాట్లాడుతూవుంటే ఎంత హుషారుగావుంది! అబ్బే! ఊరుకుంటే లాభంలేదు! మనమే మాట్లాడాలి! ఏంచేయడం. తన బెడ్ మీదవున్న ఆ నవలను చూడ్డానికన్నట్లు అడిగితే అసలు సంగతి తేలుతుందిగా. అక్కడ కంటూ వెడితే సంభాషణ కంటిన్యూ చేయొచ్చు!

ఈ విధంగా ఆయనతో నా ప్రయాణంకూడా కొనసాగితే ఎంత ఆనందంగా వుంటుందో..."అని తనలో తలుచుకుని కూర్చున్నచోటనుంచి లేచి ఎదురు వెనుక వంగి "ఆ నవల కొన్నారా?" అంది.

గురితప్పిన బాణం గురిగా తగిలింది! ఉలిక్కిపడ్డట్టు కదిలి "ఆఁ! సెంట్రల్‌లో తీసుకున్నా... తీసి చూడండి—పర్వాలేదు" అన్నాడు!

పుస్తకం చేత్తో తీస్తూ జెడలను బెడ్ మీదకువాల్చి శరీరానికి తాకిస్తూ—ఓరగా ముఖాన్ని పరికిస్తూ తీసుకుంది!

అమ్మయ్య అనుకున్నాడు తను. గట్టెక్కేమురా అనుకొంది ఆమె.

ఈ ప్రయత్నంలో స్టేషను లెన్నో వెనక్కి జరిగిపోయాయి! ఇకముందు స్టేషనులో దిగవలసి వుంది ఆమె. రైలుకంటె గుండె వేగంగా కొట్టుకుంటూంది! విద్యుత్‌కంటే హడావిడిగా మనోభావాలు పరుగులు పెడుతున్నాయి.

ఘుప్‌ఘుప్ అంటూ ధూమశకటం ఊరకలమీద నడకసాగిస్తూంది. చూసినవి చూడటానికి-విన్నవి వినడానికే వీలులేకుండా రైలుబండి పరుగు—అందుకు మించి ఆమె మనస్సు పరుగు! చాలా హడావిడిలో మునిగివుంది మనోలోకం.

ఏదో విధంగా అమ్మాయిని పలుకరించి మంచిచెడ్డలు అడగాల్సి! ఏమి అందం! అజంతా సుందరి! ఆనందరాశి! మొగలి పొద! ఆ చూపులు చూస్తూ యుగాలు గడపవచ్చు. కాలాలు జైల్లో వుండవచ్చు! అబ్బ! ఏమి తీరు! లేచి విషయం తెలుసుకొందాం.

"అదిగో మనం దిగవలసిన స్టేషను వచ్చేస్తూంది ఎలాగ? అడిగితే ఏం అనుకుంటాడో! పుస్తకం యిస్తూ ఒక్కసారి అన్నీ కదుపుతే బాగుండును! పుస్తకంమీద పేరైనా లేదు. ఈమాత్రం రాయాలని తెలియదూ?"

గుఫ్‌గుఫ్ రైలు పొగలు జిమ్ముతూ వెడుతూంది! లేచింది ఆమె! తిన్నగా సవరించుకొని తన బెడ్డుని చుట్టి-దిగవలసిన వైపునకు వచ్చి తన ప్రక్కగా నుంచుంది. ఏమిటో అడగాలి. నోరు

పెగలడం లేదు. పుస్తకం ఇంకా తన చేతిలోనే వుంది.

క్షణంలో సగంలో స్టేషను వచ్చేసింది. అందరూ దిగిపోయారు! ఇంక బండి కదిలిపోయే వేళ కూడా అవవచ్చింది.

"......"భయం కొత్త సిగ్గు! ఏం చేయడం! గార్డు విజిల్ గూబల్లో గుయ్యమంది! క్రిందికి దిగింది పుస్తకం అదించింది!

జెండా ఎగిరింది...రైలు కదిలింది...

"మా...ఎ...డ్ర...స్" అనగలిగింది! కాని ఏంలాభం క్షణంలో సగం! ముందుగాఅయితే సమాధానం అంటాడేమో రైలు కదలిక ధ్వనిలో జనం రణగొణధ్వనిలో అందలేదు ప్రశ్న! రాలేదు సమాధానం.

అలా చూస్తూ నుంచునిపోయింది ఆమె! కదిలి పోయిన రైలుబండి. కంటికి దూరమైన రైలుబండి. కరుణించని రైలుబండి! కదిలిపోయిన రైలుబండి! కంటికి దూరమై పోయింది. ఉప్పుతిన్న పాలచెంబు లాగా విరిగిన మనస్సుతో అలానుంచుని... అందని లోతులను... అంచనా వేయసాగింది ఆమె.

---

స్కెచ్

# నారీ హృదయం

"వనఫూల్"

అర్థరాత్రి దోమతెర మంచంమీద పరుండి సునంద, మైమరచి పత్రిక చదువుతూవుంది. పక్కనే తమాలకాంతుడు గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. ఇక, వారిద్దరూ భార్యా భర్తలని వేరే చెప్పనవసరం లేదు. పెళ్ళిఅయి, ఒకయేడాది అయింది: యింకా పిల్లాజెల్లా కలగలేదు.

వాళ్ళిద్దరి నిత్యకృత్యాలు యిలానే జరిగి పోతున్నవి. అంటే, నిద్రించేముందు, సునంద నిత్యమూ అర్థరాత్రిదాకా పుస్తకం చదువుతుంది. తమాలకాంతుడు పక్కనే గుర్రుకొట్టి నిద్రపోతుంటాడు.

పత్రిక పేజీలు తిరగవేస్తూంటే, హఠాత్తుగా సునంద దృష్టి ఒక కథమీదికి పోయింది. పేరు "కథకాదు." శీర్షిక చాలా చిత్రంగా వుంది. రచయితపేరు లేదు. సునంద చదవనారంభించింది. చదువుతూ చదువుతూ, సునంద మనస్సు, నిర్మల కోసం వ్యాకులపడ సాగింది. విశ్వనాథుడనే యువకునిమీద, ఆమెకు కోపం వచ్చింది. కాని యెక్కువసేపు నిలవలేదు. వీడ్కోలు సమయాన నిర్మల రెండు చేతులూ, తన చేతుల్లోకి తీసుకుని, అతను వెక్కి వెక్కి యేడుస్తుంటే, ఆమె కోపం కాస్తా చల్లారిపోయింది. విశ్వనాథు నిర్మలకు బదులు కాదంబినిని పొందాడు. క్లుప్తంగా కథ యిది:

విశ్వనాథు వేసంగి సెలవుల్లో మామగారింటికి వెళ్ళాడు. అక్కడ యేమీ పొద్దుపోక, చెరువు గట్టున తిష్ఠవేసేవాడు చేపలకోసం. ఒకనాడు గాలంవంక దీక్షగా చూస్తూ, చేప పడిందనుకుని, గాలం లాగాడు—వెంటనే 'అమ్మబాబోయ్' అనే చీత్కారం వినిపించింది.

విశ్వనాథు చకితుడై వెనుదిగిరి చూశాడు. ఆగాలం ఒక కిశోరి చీరెకు తగులుకుంది. ఆమె నిర్మల అని చెప్పవలసిన పని లేదనుకుంటాను.

ఇలానే కథ ప్రారంభమయింది.

ఆ పిమ్మట శిష్టసమ్మతమైన ధోరణిలోనే ప్రేమ కలాపాలు సాగినై. వాళ్ళ మామ రంగంమీదికి రాకపోతే, ఇంకా ముందుకు సాగేవే. ఆ మామగారు ముసిముసి నవ్వులు నవ్వుతూ యిదంతా కుర్రతనపు చేష్టగా యెంచాడు. కొద్ది రోజుల్లోనే అందమైన కాదంబినితో, విశ్వనాథుకు పెళ్ళి చేశాడు.

విశ్వనాథు మొదట వ్యతిరేకించాడు. కాని తనొక్కడివల్లా యేమవుతుంది? మహా అయితే మామను వొప్పించవచ్చును. కాని, సంఘాన్ని